క్లుప్తంగా

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

కర్నూలు(సెంట్రల్): పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పోస్టల్ బ్యాలెట్‌లో 87.87 శాతం మంది ఉద్యోగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అలాగే హోం ఓటింగ్‌లో తొలిసారి ఇంటి నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో 95.38 శాతం మంది వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం మొత్తం 22,615 మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 19,793 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోం ఓటింగ్ కోసం 997 మంది దరఖాస్తు చేసుకోగా..951 మంది ఇంటి నుంచే ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియలను రాజకీయ పార్టీల ఏజెంట్లు, ప్రతినిధులు సమక్షంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గంలో మొత్తం 3,691 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా 3,301 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ వెల్లడించారు.

నేడు కరెంట్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ లైన్ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. క్యాంపస్ సెక్షన్ డీ-2 పరిధిలోని మారుతీనగర్, సి.క్యాంప్, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సాయి వైభవ్‌నగర్, చెక్‌పోస్ట్ ఏరియా, శేషాద్రినగర్, బృందావన్ నగర్, మారుతీనగర్, మారుతీ మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీనగర్, కమలానగర్, టెలికామ్‌నగర్, గఫార్‌నగర్, ప్రశాంతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్‌నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాధవనగర్, సీ అండ్ బీక్యాంపులు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

రాజ్యసభ సభ్యుడిపై దాడి బాధాకరం

కర్నూలు (టౌన్): రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్యపై తెలుగుదేశం పార్టీ అల్లరి మూకలు రాళ్లతో దాడి చేయడం బాధాకరమని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవ పూజ ధనుంజయ్య ఆచారి గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో ఆర్.క్రిష్ణయ్యతో పాటు బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీకి చెందిన వారు రాళ్లతో దాడి చేసి గాయపరిచారన్నారు. ఓడిపోతామనే భయంతో పచ్చమూకలు భౌతిక దాడులకు పాల్పడుతున్నాయన్నారు.

కర్ణాటక మద్యం రాకుండా చర్యలు చేపట్టండి

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోకి కర్ణాటక మద్యం రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లాతో పాటు కర్ణాటక ఎక్సైజ్ అధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా సరిహద్దులో ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం జిల్లాలోకి రాకుండా నిరోధించేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, కర్ణాటక జిల్లాలు రాయచూరు, బళ్లారి, చిత్రదుర్గ, తుమకూరు, చిక్‌బల్లాపూర్, కోలార్‌పూర్ ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ఈనెల 13న డ్రైడేను పటిష్టంగా అమలు చేసేందుకు ఆయా ప్రాంతాల్లోని మద్యం దుకాణాలను మూసివేయించాలని సూచించారు.

పుల్లారెడ్డి ఆదర్శనీయులు

కర్నూలు కల్చరల్: జి.పుల్లారెడ్డి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పుల్లారెడ్డి నగర్‌లోని విజ్ఞాన మందిరంలో పుల్లారెడ్డి 17వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో గోకవరంలో జన్మించి కర్నూలు నగరంలో జి.పుల్లారెడ్డి నేతి మిఠాయిల దుకాణాన్ని, విద్యా సంస్థలను స్థాపించి దేశం మొత్తం పేరు ప్రఖ్యాతులు పొందారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విజ్ఞాన పీఠం కరస్పాండెంట్ పి.పి.గురుమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యాసరాజు, వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి గిరిబాబు పాల్గొన్నారు.

కోరం లేక జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. గురువారం ఉదయం జెడ్పీలోని సీఈఓ చాంబర్‌లో స్థాయి సంఘ సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సమావేశాలకు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. అయితే జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్లు, స్థాయి సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు ఎవరు కూడా ఈ సమావేశాలకు హాజరు కాలేదు. దీంతో సమావేశాలను నిర్వహించేందుకు కోరం లేకపోవడంతో సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు సీఈఓ ప్రకటించారు.

జగన్‌కు మద్దతుగా నిలవండి



ఒంటెద్దు బండిపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు అర్బన్‌లోని 37, 41వ వార్డుల పరిధిలోని కాలనీల్లో కార్పొరేటర్లు ఆయిషా సిద్ధిఖా, గాజుల శ్వేతారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కాలనీ వాసులు కాటసానికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, పోచా బ్రహ్మానందరెడ్డిని నంద్యాల ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి చేసిన వారికి ఎల్లప్పుడు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందన్నారు. సీఎం జగన్ ఈ ఐదేళ్ల పరిపాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ జగన్ సీఎంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆస్పత్రుల్లో వైద్యపోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయడమే కాక ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలను నాడు-నేడు పేరుతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్న ప్రతి తల్లికి ఏడాదికి రూ. 15వేలు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా మహిళల అభ్యున్నతికి వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు అమలు చేశామన్నారు. చంద్రబాబు హయాంలో ఇలాంటి ఏ ఒక్క పథకం లేదన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసినా ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, 37, 41వ వార్డునాయకులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి మధ్యాహ్నం లోపు పెండింగ్‌లోని ఓటరు స్లిప్పుల పంపిణీ
- అన్ని రకాల వసతులతో 40 మోడల్ పోలింగ్ కేంద్రాలు
- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- పోలింగ్ రోజున ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 13వ తేదీన జరిగే పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. మే 13న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. వరుస సెలవులు వచ్చాయని భావించకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలను కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 2,204 పోలింగ్ కేంద్రాల్లో 20.54 లక్షల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, మంచి నీరు, టాయిలెట్లు, కరెంట్ తదితర సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో షామియానాలతోపాటు 100 మందికూర్చోవడానికి కుర్చీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి వారు నేరుగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రథమ చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇప్పటికే 20.05 లక్షల ఓటరు స్లిప్పులన పంపిణీ చేశామని, మిగిలిన స్లిప్పులను నేటి(శుక్రవారం) మధ్యాహ్నంలోపు పంపిణీ చేస్తామన్నారు. 28 మండలాల్లో 28 మోడల్ పోలింగ్ స్టేషన్‌లు, యువకుల ఆధ్వర్యంలో రెండు, మహిళల ఆధ్వర్యంలో 8, వికలాంగుల ఆధ్వర్యంలో 2 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటిలో అన్ని రకాల సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉంటాయని చెప్పారు. పోలింగ్ రోజు, ముందు రోజు పేపర్లలో అభ్యర్థులు ఓటు అభ్యర్థించడం కోసం ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ముందుగానే తమ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 18 అత్యంత సమస్యాత్మక, 320 సమస్యాత్మ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వీటిలో సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం మైక్రో అబ్జర్వర్లు, వీడియోగ్రాఫీ తీయిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని 2,204 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ లైవ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్నికల విధుల కోసం 12,714 మంది ఉద్యోగులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

శనివారంతో ప్రచారానికి ఆఖరు...

ఎన్నికలకు 48 గంటల ముందే ప్రచారాన్ని ముగించాలన్న నిబంధన మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారాన్ని ముగించాలని కలెక్టర్ సూచించారు. ఆ తరువాత ఎలాంటి లౌడ్ స్పీకర్లు వాడరాదని, ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు ఉండకూడదని, ఇందుకోసం హోటళ్లు, లాడ్జీల్లో ప్రత్యేకంగా తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే శనివారం రాత్రి 7 గంటల నుంచి 14వ తేదీ 7గ ంటలకు మద్యం అమ్మకాలు జరుపడానికి వీలు లేదన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా...

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా వేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ జి.కృష్ణకాంత్ చెప్పారు. ఇప్పటికే 1,775 గ్రామాల్లో పోలీసులు పల్లెనిద్ర, 420 గ్రామాల్లో రాత్రి బసలు చేసినట్లు చెప్పారు. ఐదు వేల మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికల భద్రత కోసం 10 కేంద్ర పారామిలిటరీ బలగాలు వచ్చినట్లు వివరించారు

రాజకీయ పార్టీలు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీలను జిల్లా కలెక్టర్ కోరారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 13వ తేదీన పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జి.సృజన,చిత్రంలో ఎస్పీ జి.కృష్ణకాంత్

72 గంటలే కీలకం

కర్నూలు(అర్బన్): జిల్లాలో ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు ఇక 72 గంటలే కీలకమని జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ డా.జీ సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలోని కులాలు, మతాలు, సామాజిక వర్గాల మధ్య, భాషా సమతుల్యత దెబ్బతీసే ప్రయత్నాలు, ఉద్రిక్తత పెంచే చర్యలు చేపట్టరాదని సూచించారు. రాజకీ య పార్టీలు, అభ్యర్థులను విమర్శించే సమయంలో విధి విధానాలు, గతంలో చేసిన పనులకు మాత్రమే పరిమితం కావాలన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్) : పాణ్యం నియోజకవర్గంలోని 357 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సెక్టార్, ఏఈఆర్‌ఓలను ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆమె ఆరు గంటలకు పాణ్యం ఫెసిలిటేషన్ సెంటర్ బీ క్యాంపు లోని బాయ్స్ ఉన్నత పాఠశాలల నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో కరెంట్ పోయింది. అయినా, ఆమె తన టెలీ కాన్ఫరెన్స్‌ను చీకటి నుంచే కొనసాగించింది. కాగా, పోలింగ్ ముందు రోజున ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా భోజనాలు, వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలని సూచించింది

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన రేమట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు

- రేమట నుంచి టీడీపీకి చెందిన 50 కుటుంబాలు
- మెరుగుదొడ్డి నుంచి 50 కుటుంబాలు
- గూడూరు నుంచి 500 మంది చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కోట్ల హర్ష

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీకి కోలుకోలేని దెబ్బలు తగులుతున్నాయి. గురువారం పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, వివిధ సంఘాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

☛ కర్నూలు రూరల్ మండలం రేమట గ్రామంలో టీడీపీలోని బోయ సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, తిరుమలరెడ్డి, శివ శంకర్ నాయుడు, సంపత్‌కుమార్, బోయ సురేష్, బోయ హనుమంతు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరిలో మహేష్, తిరుమల, సుధాకర్, రామాంజి, పులికొండ, శ్రీరామ్, మద్దిలేటి, శ్రీను, జయరాం, గోపాల్, కుమార్, శేఖర్, అనిల్ తదితరులు ఉన్నారు.

☛ కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన సత్యంరెడ్డి, సూర్య నారాయణ, ప్రసాద్, శివ శంకర్, వెంకటేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారిలో రామాంజనేయుడు, బలరాం, నాగేశ్వరరావు, అశోక్, ఏసు, తిమ్మప్ప, నరసింహుడు, వీరన్న తదితరులు ఉన్నారు.

☛ గూడూరు పట్టణానికి చెందిన వడ్డెర, బెస్త, ముస్లిం, మాల యువజన సంఘాలకు చెందిన 500 మంది గూడూరు నగర పంచాయతీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరిలో షేక్‌షావలి, ఫాజిల్, మక్బుద్, రహిమాన్, రజాక్, జుబేర్, షేక్‌షావలి, షాకీర్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రాఘవులు, రామాంజనేయులు, తెలుగు చంటి, గంగాధర్, లక్ష్మన్న, ఆది, రామాంజనేయులు, బోయ రేగల వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, వీరేష్, గిడ్డయ్య, గిరి తదితరులు ఉన్నారు.

ప్రతి గ్రామంలో విద్యుత్ సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): పోలింగ్ సజావుగా సాగేందుకు ప్రతి గ్రామంలో విద్యుత్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు. ప్రస్తుతం అకాల వర్షాలు, పెనుగాలులు వీస్తున్నాయని, విద్యుత్ పోల్స్, లైన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని, విద్యుత్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. .

వర్షాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణం చల్లబడింది. మొన్నటి వరకు వడగాడ్పులతో అల్లాడిన ప్రజలకు నేడు చల్లదనం ఊరటనిస్తోంది. గురువారం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుముఖం పట్టారు. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతం అయింది. వివిధమండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. కర్నూలు, గూడూరు, హాలహర్వి, ఆలూరు, కోడుమూరు, కృష్ణగిరి, ఆదోని, పెద్దకడబూరు తదితర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. జిల్లాలో 46 డిగ్రీలకుపైగా చేరిన ఉష్ణోగ్రతలు 36-37 డిగ్రీల వరకు మాత్రమే నమోదవుతున్నాయి.

బీఎల్‌ఓ సస్పెన్షన్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ఎస్.నాగప్పవీధిలోని 131 సచివాలయంలో పనిచేసే వీఆర్‌ఓ శివప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. బూత్ లెవల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈయన ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేయడంలో అలసత్వం ప్రదర్శించారు. 1,141 ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉన్న కేవలం 136 స్లిప్పులు పంపిణీ చేయడం, నిర్లక్ష సమాధానం ఇవ్వడంతో కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ గురువారం సస్పెండ్ చేశారు.

ఓటు హక్కు కలిగిన వారికే పోలింగ్ ఏజెంట్లుగా అవకాశం

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గం పరిధిలో ఓటు హక్కు కలిగిన వారికి మాత్రమే పోలింగ్ ఏజెంట్లుగా అవకాశం కల్పిస్తున్నట్లు కర్నూలు ఆర్‌ఓ భార్గవ్ తేజ అన్నారు. ఫారం 10 సమర్పించే సమయంలో తమ ఓటరు కార్డు తప్పకుండా జత చేయాల్సి ఉంటుందన్నారు. గురువారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లుగా నియమించుకునే వ్యక్తుల వివరాలను ఫారం 10 ని పూర్తి చేసి ఈనెల 12 వ తేదీ లోపు సమర్పించాలన్నారు.

ప్రధాని మోదీ ప్రజలకు చేసింది శూన్యం

- సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు



ఎన్నికల ప్రచారంలో పి.మధు

కల్లూరు: 2014 నుంచి 2024 వరకు దేశాన్ని పాలించిన నరేంద్ర మోదీ ప్రజలు చేసింది శూన్యమని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. గురువారం కల్లూరు మండలంలోని పెద్దపాడు, ఉలిందకొండ గ్రామాల్లో పాణ్యం నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి గౌస్ దేశాయ్‌కి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గౌస్ దేశాయ్‌ని గెలిపిస్తే పెద్దపాడులో దామోదరం సంజీవయ్య స్మారక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మోదీ పదేళ్ల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలతో పాటు నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. చెప్పుకునేందుకు చేసిన అభివృద్ధి ఏమీలేకపోవడంతో బీజేపీ సర్కారు ఈ ఎన్నికల్లో మతోన్మాద విద్వేషాలను రెచ్చగొడుతుందని విమర్శించారు. ఇప్పటి వరకు జరిగిన మూడు విడతల ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూలంగా పోలింగ్ జరగలేదన్నారు. అందుకే ఇటీవల కాలంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ అధికారులను ఉసిగొల్పుతున్నారని చెప్పారు. రామాలయ నిర్మాణం చూపి ఓట్లు దండుకునేందుకు మోదీ సర్కారు కుట్రలు పన్నుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీతో జతకట్టిన తెలుగుదేశం, జనసేన పార్టీలు కూడా తొడుదొంగలేనన్నారు.ఆయా పార్టీలకు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గోవిందు, అంజిబాబు, అలివేలమ్మ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, డప్పు కళాకారులు, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిని ఓడించండి

- వైఎస్సార్‌సీపీకి మాల మహానాడు సంపూర్ణ మద్దతు
- పి.వి. రావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పందు అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పందు అశోక్ కుమార్

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని ఓడించాలని పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పందు అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నరసింగరావు పేటలోని వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని చెబుతున్నారన్నారు. అలాంటప్పుడు ఎస్సీ వర్గీకరణ ఎలా చేపడతారన్నారు. దేశంలో ఐక్య రిజర్వేషన్ కావాలని, వర్గీకరణ వద్దన్నారు. ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు మద్దతు ఇస్తూ దేశ సంపదను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అని, లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే కార్మికులు రోడ్డున పడతారన్నారు. మాజీ ఐఏఎస్, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మపు సూర్య వర ప్రసాద్ మాట్లాడుతూ ఇంగ్లిషు మీడియం చదువులపై బీజేపీ మాట్లాడటం తగదన్నారు. ఇంగ్లిషు ఒక యూనివర్సల్ బాషా అన్నారు. ఇందులో ప్రావీణ్యం సాధిస్తేనే విజయ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాధవరావు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

తారస్థాయికి చేరిన టీడీపీ విభేదాలు

- కోడుమూరులో డబ్బుల పంపిణీ కోసం ఇరువర్గాల పోటీ
- నేడు కోట్ల, విష్ణు వర్గీయుల సమావేశం

కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి వర్గాల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు నియోజకవర్గానికి రూ.15 కోట్ల చొప్పున కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు డబ్బులు చేరాయని సమాచారం. అయితే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి మధ్య ఉన్న విభేదాల కారణంగా కోడుమూరు నియోజకవర్గంలో డబ్బుల పంపిణీ కార్యక్రమం వాయిదా పడిందట. పంపిణీ వ్యవహారమంతా తనకు అప్పచెబితేనే అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని.. లేదంటే ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్ నుంచి తప్పుకుంటానని పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న రామలింగారెడ్డి వద్ద ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తేల్చిచెప్పినట్లు సమాచారం. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సొంత గ్రామమైన లద్దగిరిలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను గెలిపించుకోలేకపోయారని.. కర్నూలు మండలంలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తన వర్గీయులు గెలిచారనే నమ్మకంతోనే తనను నమ్మి అసెంబ్లీ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరి, ఎంపీగా నాగరాజుకు పోటీ చేసే అవకాశం అధిష్టానం కల్పించిదని పేర్కొన్నట్లు తెలిసింది.

నేడు ఇరువర్గాల సమావేశం

ఓటర్లకు డబ్బుల పంపిణీ చేసే విషయంపై రాజీ కుదిర్చేందుకు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి,కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వర్గీయులతో కర్నూలులో సమావేశం అయ్యేందుకు టీడీపీ ఇన్‌చార్జ్ రామలింగారెడ్డి ఓ రహస్య ప్రదేశంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే పెత్తనమంతా తనకు ఇస్తేనే కలిసి పనిచేస్తానని.. లేకుంటే మీరే చేసుకోండని విష్ణువర్ధన్‌రెడ్డి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసినట్లు తెలిసింది.

ఇసుక రీచ్‌లో అధికారుల తనిఖీ

కర్నూలు (న్యూటౌన్): కౌతాళం మండలం గుడికంబాలి మర్లి గ్రామంలోని రీచ్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఎన్నికల కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖ ర్, సెబ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేశారు. బయట ఉన్న 1.5 టన్నుల స్టాక్ డంప్ నుంచి తవ్వకాలు జరుపుతున్నారు తప్ప ప్రస్తుతం రీచ్‌లో ఎలాంటి తవ్వకాలు జరపడం లేదని విచారణలో తేల్చారు. ఫిర్యాదులో ఎలాంటి నిజం లేదని తెలిపారు.తనిఖీల్లో జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ బాషా పాల్గొన్నారు.

మాతాశిశు సేవల బలోపేతానికి కిల్కారి మెసేజ్ విధానం

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో మాతాశిశు సేవలు బలోపేతం చేయడంలో భాగంగా కిల్కారి మెసేజ్ విధానం ప్రారంభించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కిల్కారి మెసేజ్ విధా నంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆశా నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీరికి కిల్కారి స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లంకపల్లి రాజు, కిల్కారి ప్రోగ్రామ్ రీజనల్ కో ఆర్డినేటర్ కీర్తి ద్వారా ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కిల్కారి విధానంలో గర్భిణులకు 4వ మాసం నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్ 01244451660 నుంచి వస్తుందన్నారు. ఏదైనా కారణం వల్ల గర్భిణి/తల్లి ఆ వాయిస్ మెసేజ్ వినలేకపోయినచో తర్వాత 14423 నెంబర్‌కు కాల్ చేసి వాయిస్ మెసేజ్‌ను వినేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కాల్స్ పూర్తిగా ఉచితమని, ఎలాంటి కాల్ ఛార్జెస్ ఉండవని తెలిపారు. కిల్కారి స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ ఈ వాయిస్ మెసేజ్‌ల ద్వారా ముఖ్యంగా నాలుగు అంశాల(మాతృ ఆరోగ్యసేవలు, శిశు ఆరోగ్యసేవలు, వ్యాధినిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ సేవలు) గురించి సలహాలు, సూచనలు ప్రీ రికార్డెడ్ వాయిస్ రూపంలో వస్తాయన్నారు. అనంతరం ఆశా మొబైల్ అకాడమి ఆన్‌లైన్ ట్రైనింగ్‌లో దేశంలోనే కర్నూలు జిల్లా వంద శాతం సాధించినందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్‌ను, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్‌ను, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డిని కిల్కారి స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లంకపల్లి రాజు ప్రశంసించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కిల్కారి ప్రోగ్రామ్ రీజనల్ కో ఆర్డినేటర్ కీర్తి, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీహెచ్‌ఎన్‌ఓ ఇందిర, డెమో ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.